## నర్సింగ్ గౌడ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



నర్సింగ్ గౌడ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట్, మే 10: మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీలో సర్దార్ నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంగపురం నర్సింగ్ గౌడ్ గత వారం యాక్సిడెంట్ కు గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి శనివారం పరామర్శించారు. ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని ఆయనకు ఎమ్మెల్యే సూచించారు. నర్సింగ్ గౌడ్‌ను కలిసిన వారిలో మాజీ కౌన్సిలర్ రెడ్డి గళ్ళ సుమన్, మీర్ పేట్ మున్సిపాల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, సీనియర్ నాయకులు పోరెడ్డి బుచ్చి రెడ్డి, రత్నం, గడ్డిరాజు, వెంకటరాజి రెడ్డి పాల్గొన్నారు.

## దేశ సంరక్షణ కోసం ప్రత్యేక పూజలు



హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్

హయత్ నగర్, మే 10 : దేశ సరిహద్దుల్లో రేయింబవళ్లు.. ప్రాణాలకు తెగించి.. కుటుంబాన్ని త్యజించి.. దేశం కోసం, మన కోసం పోరాడుతున్న సైనికులకు అండగా నిలుస్తూ, భారత్ ఆర్మీకి మద్దతుగా, దేశ సంరక్షణ కోసం హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశానికి ఉక్కు కవచంగా భారత్ రక్షణా బలగాలు పాక్ దాడిని తిప్పి కొడుతున్నాయని తెలిపారు. దేశ సరిహద్దుల్లో పౌర నివాసాలపై మిస్సైల్స్ ప్రయోగించిన పాకిస్తాన్‌కు దీటుగా అధునాతన సాంకేతిక సైనిక పరికరాలను ఉపయోగించి వాటిని గాల్లోనే ధ్వంసం చేసిన దేశ సైన్యానికి పౌరులందరూ అండగా ఉందామన్నారు. భారత సైన్యానికి అండగా నిలుస్తూ నేడు హయత్ నగర్ అయ్యప్ప దేవాలయం సమీపంలోని హనుమాన్ దేవాలయంలో దేశ సంరక్షణ కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, జిల్లా ఎస్సీ మోర్చా నాయకుడు పారంద మహేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు పార్వతి, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, నాయకులు వస్పరి వెంకటేష్, ఎర్రవెలి సత్యనారాయణ, జనార్దన్, సురేష్, బాలు నాయక్, నర్సింహా, సురేష్ రెడ్డి, ఎర్ర ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

### మామిడిపండ్ల గోదాములపై
# అధికారుల దాడులు
### మక్కపెడుతున్న సుమారు రూ.6 లక్షల విలువైన మామిడికాయల స్వాధీనం



మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శాలివాహన నగర్‌లోని గోదాంలో అధికారులు సీజ్ చేసిన మామిడి కాయలు



హానికర కార్బైడ్, ఇథిలిన్‌తో మక్క పెట్టిన మామిడి పండ్లు. (మామిడి పండ్ల మధ్యన పెట్టిన కార్బైడ్)

మలక్ పేట, మే 10: ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూర్చే మామిడికాయలను హానికరమైన రసాయనాలతో మక్క పెడుతున్న పలు గోదాములపై జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు, సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించి సుమారు రూ.6 లక్షల విలువైన మామిడికాయలను సీజ్ చేశారు. టాస్క్ ఫోర్స్ అదనపు డీసీపీ ఏ. శ్రీనివాస రావు పర్యవేక్షణలో సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు ఆధ్వర్యంలో మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శాలివాహన నగర్, సలీం నగర్, చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకర్‌నగర్‌లలోని మూడు గోదాములపై దాడులు నిర్వహించిన అధికారులు, అధిక మొత్తంలో కార్బైడ్, ఇథలిన్‌ను ఉపయోగించి మామిడి కాయలను మక్కబెడుతున్నట్లుగా గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలకు విరుద్ధంగా ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా అధిక మొత్తంలో రసాయనాలను వాడుతున్నట్లు గుర్తించిన అధికారులు శంకర్‌నగర్‌లో రూ.1.5 లక్షల విలువైన మామిడికాయలను, శాలివాహన నగర్లో సయ్యద్ వసీం అక్రమ్, ఎండి షేర్ ఖాన్‌ల రెండు గోదాంల్లో రూ .3.5 లక్షల. విలువైన మామిడికాయలను, సలీంనగర్‌లో వ్యాపారి మహమ్మద్ అజీమ్ ఖాన్ నివాసంలో ఏర్పాటు చేసిన గోదాంలో రూ.60 వేల విలువైన మామిడికాయలను సీజ్ చేసి ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. అజీమ్ ఖాన్ మామిడికాయలను మక్క పెట్టేందుకు కాల్షియం కార్బైడ్, ఇథలిన్, కాల్షియం ఎసిటలైడ్‌ను మోతాదుకు మించి(అధిక మొత్తంలో) కాయల మధ్యన కార్బైడ్, ఇథలిన్ శాసెట్లను (ప్యాకెట్లను) పెట్టి మక్క పెడుతున్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న మామిడికాయలను ల్యాబ్ టెస్ట్‌లకు పంపించినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు.

**ఆహార భద్రత నియమాలకు విరుద్ధంగా**

ఆహార భద్రత నియమాల ప్రకారం ఇథలిన్ (ఇథోఫాన్) ప్యాకెట్లను గడ్డి, పేపర్ల మధ్యన పెట్టి, పేపర్‌కు హోల్ చేసి వాటిపై మామిడికాయలను పోసి ఇథలిన్ గ్యాస్‌తో మక్క పెట్టాల్సి ఉండగా, వ్యాపారులు అందుకు విరుద్ధంగా డైరెక్ట్‌గా కాయల మధ్యనే శాసెట్లను పెట్టి మక్క పెడుతున్నట్లు గుర్తించారు. ఈ విధంగా మామిడికాయలను మక్కపెట్టడం ద్వారా చర్మ సంబంధిత సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన సమస్యలు, ఇతరత్రా తీవ్రమైన ఆరోగ్య సమస్యల బారిన పడతారని అధికారులు తెలిపారు.

## భారత ఆర్మీకి ఆత్మస్థైర్యం, శక్తిని ఇవ్వాలని పూజలు

ఎల్బీనగర్, మే 10: పాకిస్తాన్‌తో ధర్మ యుద్ధం చేస్తున్న ఆర్మీకి ఆత్మస్థైర్యం, శక్తిని ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు బొల్గం యశ్పాల్ గౌడ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కొత్తపేట డివిజన్లో మోహన్ నగర్‌లో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయం, శివాలయంలో పూజలు నిర్వహించి, శివాలయంలో అభిషేకం చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి నందికొండ గీతారెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షుడు రాజేంద, డివిజన యువమోర్చా అధ్యక్షుడు కిరణ్ కుమార్, జనరల్ సెక్రెటరీ వినోద్, తరుణ్ సింగ్ ఠాగూర్, వెంకటేష్, సంప్రీతి, విష్ణు గౌడ్, శుక్లా, యశ్వంత్, మల్లికార్జున్, తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.



ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేసిన బీజేపీ నాయకులు

### ఫణిగిరి లక్ష్మీ నరసింహస్వామి
## ఆలయాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే



లక్ష్మీ నరసింహస్వామి జయంతి, కల్యాణ మహోత్సవం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఆలయ చైర్మన్ కృష్ణారెడి, తదితరులు

ఎల్బీనగర్, మే 10: ఫణిగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం(కోసగుండ్ల) అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని ఫణిగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం (కోసగుండ్ల)) నందు లక్ష్మీ నరసింహస్వామి వారి జయంతి-కల్యాణ మహోత్సవం నందు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎంతో చరిత్ర కలిగిన ఈ దేవస్థానం మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్, ఆలయ చైర్మన్ కృష్ణ రెడ్డి, వైస్ ఛైర్మన్ నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# హామీల అమలులో ప్రభుత్వం విఫలం



కీసరలోని మల్లన్నగుడి వద్ద నిర్వహించిన గొర్రెల మేకల కాపర్ల సంఘం సమావేశం

**కీసర, మే 10:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొముర‌య్య, జిల్లా అధ్యక్షులు మేకల కుమార్ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాల్టీ కీసరలోని మల్లన్నగుడి వద్ద గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల మేకల పెంపకందార్లకు రూ.2 లక్షల నగదు, బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలో రాగానే ఇచ్చిన హామీలను మరిచిపోయిందన్నారు. పశువైద్యశాల్లో ఎటువంటి మందులు ఉండటం లేదని, రెండేండ్ల నుంచి కనీసం నట్టల నివారణ మందులను కూడా ఇవ్వడం లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ వీధికుక్కల దాడులు, రకరకాల ప్రమాదాల్లో వందలాది గొర్రెలు చనిపోతున్నాయని, మరణిస్తున్న గొర్రెల కాపరులకు ఎక్స్‌గ్రేషియో ఇవ్వడం లేదని, రోజురోజుకు గొర్రెల దొంగతనాలు పెరిగిపోతున్నాయని, పశుసంవర్ధకశాఖ నుంచి ప్రత్యేక మంత్రిని కూడా వేయలేదని, ఆ శాఖ ముఖ్యమంత్రి దగ్గరనే ఉందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నాయకులు జంగయ్యయాదవ్, ఐలయ్యయాదవ్, రాజుయాదవ్, ఆంజనేయులుపాల్గొన్నారు.

## పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరించాలి

**నేరేడ్‌మెట్, మే 10:** సఫిల్‌గూడ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. సఫిల్‌గూడ రైల్వే పెన్షనర్స్ కార్యాలయంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ నారాయణ, కార్యదర్శి కే. నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ చేయాలని, పెన్షనర్స్‌కు కొన్ని బ్యాంక్‌లు డీఏ ఎరియర్స్ ఆలస్యంగా ఇస్తున్నారని, ప్రతి సంవత్సరం మెడికల్ క్యాంపు పెట్టి పెన్షనర్స్‌కు మెడికల్ చెకప్ చేయించాలని కోరారు. అనంతరం నడి అవార్డు గ్రహీత బి. వినోద్‌బాబును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150మం ది రైల్వే పెన్షనర్స్ తదితరులు పాల్గొన్నారు.

## 12న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**శామీర్‌పేట, మే 10 :** ఈ నెల 12వ తేదీన మూడుచింతపల్లి మండలం అనంతారం, ఉద్దెమర్రి గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఏవో ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ ( యూనిక్ ఐడెంటిఫికేషన్ నెంబర్) కోసం రైతుల నుంచి ఆధార్, పట్టా పాస్ పుస్తకం తీసుకుంటామన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలతో రైతులు, మహిళలు, పాఠశాల పిల్లలకు ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మార్కెట్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి



మదన్నపేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

సైదాబాద్, మే 10 : మాదన్నపేట మార్కెట్‌లో రోడ్లపై అక్రమ వ్యాపారాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ శనివారం మాదన్న పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మాదన్నపేట్ మార్కెట్లో 62 మంది వ్యాపారులకు అధికారికంగా లైసెన్సులు ఇవ్వడం జరిగిందని, అయితే అందుకు విరుద్ధంగా వ్యాపారులు రోడ్లపై వ్యాపారాలు కొనసాగిస్తూ మార్కెట్‌కు వచ్చే వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని తెలిపారు. లైసెన్స్ పొందిన వ్యాపారులంతా తమ స్థలాలను ఇతరులకి లీజులకు ఇచ్చి అక్రమ వ్యాపారాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నారన్నారు. రోడ్లు అక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారి మూలంగా కొనుగోలుదారులకు, అదే విధంగా దిగుమతి, ఎగుమతి చేసే వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తూ మార్కెట్లో ట్రాఫిక్ అంతరాయం సృష్టిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై అక్రమ వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి, తగు చర్యలు తీసుకోవాలని మాదన్న పేట్ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. కూరగాయలు, ఆకుకూరల కొనుగోలు కోసం వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## లోవోల్టేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి



పద్మాలయ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

హయత్ నగర్, మే 10 : డివిజన్ పరిధిలోని పద్మాలయ కాలనీలో తరచుగా నెలకొంటున్న లోవోల్టేజీ విద్యుత్ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేశామని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. శనివారం పద్మాలయ కాలనీలో కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, విద్యుత్ ఏఈ ఖాదర్ ఆలీతో కలిసి నూతనంగా ఏర్పాటుచేసిన 160 కే వీ ఏ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో లోవోల్టేజీ విద్యుత్ సమస్య కారణంగా కాలనీవాసులు అనేక ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. దశల వారీగా కాలనీలలో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మన్ అశోక్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యుడు అంజయ్య గౌడ్, నరసింహులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## మలక్‌పేటలో 13న గ్రాండ్ జాబ్ ఫెయిర్

సైదాబాద్, మే 10: మలక్ పేట నియోజకవర్గం పరిధిలోని నిరుద్యోగ యువతీ, యువకుల కోసం ఈ నెల 13న 'గ్రాండ్ జాబ్ ఫెయిర్ 2025' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, ఇబ్నాట్ ఫౌండేషన్ సహకారంతో అక్బర్ బాగ్ డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ మెస్ లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ , పీజీ, డిప్లమా, బీఈ, బీటెక్ పూర్తిచేసిన యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరుద్యోగులు కొత్తవారు, అనుభవాలు ఐటి, నాన్ ఐటీ, బ్యాంకింగ్ సేల్స్ డిజిటల్ మార్కెటింగ్ రంగాలకు సంబంధించిన ఉద్యోగాలు పొందేందుకు ఈ అవకాశం దోదపడుతుందన్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ, మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ (ఎన్ ఎస్ బి ఐ), టెలికాం (ఎంప్లాయిమెంట్ ఇన్ అబ్రాడ్)తో సహా 50 ప్రైవేట్ కంపెనీల సంస్థలలో వందలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# దేశ ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలి



ఉప్పల్ మండల 4వ మహాసభ సందర్భంగా ఎర్రజెండా ఎగురవేస్తున్న సీపీఐ నేతలు

**కాప్రా,మే10:** దేశ ప్రజలు ఐకమత్యం గా ఉండాలని సీపీఐ ఉప్పల్ మండ లం 4వ మహాసభ పిలుపు ఇచ్చింది. ఈసీఐఎల్ కమలానగర్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఉప్పల్ మండల కార్యదర్శి పి.రామ్‌నారాయణ అధ్యక్షతన జరిగిన సీపీఐ 4వ మహాసభలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డీజీ సాయిలు గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం పాకిస్థాన్‌తో జ రుగుతున్న యుద్ధవాతావరణం దృష్ట్యా దేశప్రజలంతా ఐకమత్యంగా ఉండాలని, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌ను కట్టడి చేయాలన్నారు. ఎన్నికల్లో ఇ చ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైన నేపథ్యంలో సీపీఐ ప్రజల పక్షాన నిలబడిసమరశీలపోరాటు నిర్వహించడానికి కార్యాచరణ రూపొందిస్తున్నదని అన్నా రు. సభ ప్రారంభానికి ముందు ఎర్రజెండాను సాయిలుగౌడ్ ఎగురవేశారు. అనంతరం కార్యక్రమాల ఫొటో ఎగ్జిబిష న్ ప్రదర్శించారు.

కార్యక్రమంలో సీపీఐ నేతలు దామోదర్ రెడ్డి, శంకర్‌రావు, ధర్మేంద్ర, మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహ, బషీర్, కృపాకర్, స్వామిదాస్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**మల్లాపూర్, మే 10:** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీల్లో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి అన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఆయన శనివారం డివిజన్ పరిధిలోని బ్రహ్మపురి కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని సదరు కాంట్రాక్టర్,అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ శ్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

# శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పిస్తాం



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

**మల్కాజిగిరి, మే 10 :** శ్మశానవాటికలలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మచ్చ బొల్లారం డివిజన్ బంధం భావి తుర్కపల్లికి చెందిన హిందూ శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించాలని కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. అల్వాల్ డివిజన్‌కు చెందిన వినీత్ కు రూ. 75 వేలు, వహీదా బేగంకు రూ. 28 వేల సీఎంఆర్ ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని శ్మశాన వాటికల్లో వసతులపై సర్వే నిర్వహిస్తామన్నారు. శ్మశాన వాటికలో పవర్ బోరుతో పాటు స్థానం గదులను, బల్లలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శోభన్, రమేష్, పరమేష్ , పవన్, సూర్య కుమార్, దేవేందర్, కార్తీక్ ,చంద్రకుమార్, వినోద్, బాలేష్, నవీన్, వెంకట్, ఉపేందర్, పవన్, ఆరిఫ్ , రేవంత్ రెడ్డి, దేవేందర్, అరుణ్, కార్తీక్ పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళా



వనస్థలిపురం కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళాను కొద్ది రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఈ మేళాలో మహిళలను ఆకట్టునే విధంగా మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, బెంగాల్ కాటన్, ఖాదీ మెటీరియల్, డిజైనర్ శారీస్, బ్లౌజెస్, వన్‌గ్రామ్ గోల్డ్, జ్యూవెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్, మరెన్నో అద్భుతమైన వస్త్ర ప్రదర్శన గలదు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

**PUBLIC NOTICE**

This is to inform the general public that **JUNNA VIJAYAMMA** is the owner of Plot No. 73, Land admeasuring 394 Sq.yds., In Survey No. 12 to 16, Situated at Thummabowli Village, Saroornagar Mandal, Ranga Reddy District., who acquired the same vide Registered sale deed no. 1562/2000 dated 19-04-2000. The Original Link Registered Sale Deed No.1865/1989 dated 07-02-1989 is lost.

Whosoever has found the above mentioned original documents and whoever has got any claims or rights over the above mentioned property. Please contact **J. SIVANESAN,** Advocate, Contact No. 9393099915 within 10 days from date of publication of this notice.